ఆహ్లాదం మాటున విషాదం!



ఆదలి వ్యూ పాయింట్

- ప్రమాదాలకు నెలవుగా ఆదలి వ్యూ పాయింట్
- ఘాట్‌రోడ్డులోని మలుపులతో ముప్పు
- ప్రమాదం బారినపడుతున్న సందర్శకులు
- ఇటీవల ఒకరు మృత్యువాత, పలువురు ఆస్పత్రిపాలు
- భయాందోళనలో పర్యాటకులు



ఆదలి వ్యూ పాయింట్ ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన భారతి(ఫైల్)

సీతంపేట/పాలకొండరూరల్:

ఆదలి వ్యూ పాయింట్.. ఆహ్లాదం పంచే ప్రాంతం. దాని మాటున విషాద ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. ఎత్తైన ఆ కొండ ప్రాంతం నుంచి సీతంపేట మన్యం అందాలను చూసి ఆనందించేందుకు వెళ్తున్న పర్యాటకుల ప్రాణాలను అక్కడి ఘాట్‌రోడ్డు మలుపులు హరిస్తున్నాయి. ఆదమరిస్తే చాలు సందర్శకుల వాహనాలు లోయల్లోకి దూసుకువెళ్లే ప్రమాదం నెలకొంది. ఇటీవల అక్కడి ఘాట్ రోడ్డు మలుపుల వద్ద ప్రమాదానికి గురై, చాలా వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇప్పటివరకు ఒకరు మృతి చెందగా, చాలామంది క్షతగాత్రులై ఆస్పత్రిపాలయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భయపడుతున్న సందర్శకులు..

సీతంపేట ఏజెన్సీలో రూ.2 కోట్లతో సరికొత్త రూపు దిద్దుకున్న ఆదలి వ్యూ పాయింట్ ప్రారంభమైన అనతికాలంలోనే ప్రకృతి ప్రేమికుల మదిని దోచుకుంది. సీతంపేట మండల కేంద్రం మీదుగా కిట్టాలపాడు కూడలి నుంచి వయా శంబాం మీదుగా సహజ సిద్ధమైన కొండల మధ్య వంపుసొంపులతో కూడిన రహదారి అందాల మీదుగా వ్యూ పాయింట్‌కు ప్రయాణం సాగుతుంది. సీతంపేట నుంచి ఎనిమిది కిలోమీటర్ల మేర సాగే ఆ ప్రయాణంలో దారి మధ్య మధ్యలో వచ్చే ప్రతీ మలుపు, ప్రకృతి అందాలు అటువైపుగా వెళ్లే వారి మనసును కట్టిపడేస్తాయి. ప్రస్తుత శీతాకాలంలో ఉదయం, సాయంత్రం ఏర్పడే మంచుపొరలు, చల్లని గాలి, ప్రకృతి రమణీయత సందర్శకులకు ఆహ్లాదం, ఆనందం పంచుతాయి. ఇంతవరకు అంతా బాగానే ఉన్నా వ్యూ పాయింట్ చేరేందుకు ఉన్న ఘాట్‌రోడ్డు మలుపులే ఇప్పుడు సందర్శకులను భయపెడుతున్నాయి. తరచూ ఏదో మలుపు వద్ద ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇదే ఇప్పుడు పర్యాటకులను భయాందోళనలోకి నెట్టింది.

ఇటీవల ప్రమాదాల్లో..

ఇటీవల పాలకొండలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన భారతి తన భర్త, పిల్లలతో కలిసి వ్యూ పాయింట్ అందాలు చూసి ఇంటికి తిరిగి వెళ్తుండగా, వెల్లంగూడ మలుపు వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. ఈ విషాద ఘటనతో ఉలిక్కిపడ్డ అధికార యంత్రాంగం.. అప్పట్లో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు కూడా ఏర్పాటు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవడాన్ని తప్పనిసరి చేస్తూ కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకునేలా చర్యలు తీసుకున్నారు. ఆ ఘటనకు ముందు శ్రీకాకుళానికి చెందిన ఓ కుటుంబం ఆటోతో ఆదలి వ్యూ పాయింట్‌కు వచ్చి, వెళ్తుండగా మార్గమధ్యంలోని మలుపు వద్ద అక్కడి లోయలోకి వారి ఆటో పడిపోయింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వారందరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జరిగి నెలలు గడవకముందే పిక్నిక్‌కు వెళ్లిన శ్రీకాకుళానికి చెందిన మరో కుటుంబం.. సవర గొయిది సమీపంలో వారి మ్యాక్సీక్యాబ్ ఘాటీ దిగుతుండగా అక్కడి గుట్టను ఢీకొని స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. సరిగ్గా రెండు రోజుల క్రితం(గురువారం సాయంత్రం) ఆదలి వ్యూ పాయింట్ నుంచి దిగి వస్తున్న ఆటోను దాని వెనక నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో పర్యాటకులు గాయపడ్డారు. ప్రస్తుతం ఆ ఘటనలో గాయపడిన వారంతా పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. అదే సమయంలో మరో ఆటో కూడా ఘాటీ దిగుతుండగా అక్కడి చెట్టును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆటోలోని వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పోలీసులు



కొన్నిరోజుల క్రితం ఘాటీ దిగుతుండగా లోయలోకి దూసుకెళ్లిన మ్యాక్సీక్యాబ్

మలుపులే..ప్రమాదానికి పిలుపులు..

ఆదలి వ్యూ పాయింట్ చేరుకునేందుకు సీతంపేట నుంచి వయా కిట్టాలపాడు ఒకదారి అయితే పాలకొండ నుంచి కుశిమి మీదుగా చేరుకునేందుకు మరో మార్గం ఉంది. వ్యూ పాయింట్ చేరుకునే క్రమంలో వెల్లంగూడ, సవరగొయిది, కిట్టాలపాడు, శంబాం, కోడిశ తదితర చోట్ల ఘాటీ మలుపులు ప్రమాదకరంగా మారాయి. అటు ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, ఇటు ఒడిశాలోని రాయగడ, కాశీనగర్, పర్లాకిమిడి తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకుల రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వ్యూ పాయింట్‌ను చేరుకునే క్రమంలో ఉన్న ఘాట్‌రోడ్డులో మలుపులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

నివారణ చర్యలు తీసుకుంటాం..



పర్యాటకులు ప్రమాదం బారినపడకుండా ప్రత్యేక దృష్టిసారించాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. ఇదివరకు అవగాహన కోసం బోర్డులు, సూచీలు కూడా ఏర్పాటు చేశాం. తాజాగా జరిగిన దుర్ఘటనల ప్రదేశాల వద్ద ఫ్లెక్సీబోర్డులు ఏర్పాటు చేస్తాం. పర్యాటక రంగానికి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటాం. పర్యాటకులు రద్దీగా ఉండే రోజుల్లో భద్రతను ఏర్పాటు చేస్తాం. పర్యాటకులు సహకరించాలి.
–ఎం.రాంబాబు, ఎస్‌డీపీవో, పాలకొండ

క్లుప్తంగా

ఎస్‌డబ్ల్యూపీసీ ప్రారంభం

పాలకొండ రూరల్: మండలంలోని బెజ్జి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ సెంటర్/చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రతీ ఇంటి వద్ద నుంచి సేకరించిన చెత్తను ఈ సెంటర్‌కు తరలించి, ఎరువును తయారు చేయాలని, దానిని రైతులకు సబ్సిడీపై అందించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలని ఎమ్మెల్యే కోరారు.

బాపూజీనాయుడు నియామకం పట్ల హర్షం

గరుగుబిల్లి: వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా మరిశర్ల బాపూజీనాయుడు నియామకం పట్ల పార్టీ శ్రేణుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఎంపీపీ ఉరిటి రామారావు, సర్పంచ్‌లు ఉరిటి నిర్మల, బి.మహేశ్వరరావు, కె.ఇందుమతి, కె.శిరీష, బి.లక్ష్మి, జి.పద్మావతిలతో పాటు పార్టీ నాయకులు కె.కూర్మినాయుడు, కె.అచ్చుతరావు, టి.ఎల్లంనాయుడు, బి.సురేష్, ఎం.అప్పారావు, డి.జోజి, ఆర్.రామినాయుడు, ఎ.రామకృష్ణ, జి.చంద్రశేఖరరావులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



కాసుల వర్మ

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న ఆయుష్ వైద్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ కాసుల వర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

చేపపిల్లల విడుదల



చెరువులోకి చేపపిల్లలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి వద్ద కిరండాల్ చెరువులోకి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం చేపపిల్లలు విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఐటీడీఏ గిరిజన ఉప ప్రణాళిక పథకంలో శతశాతం సబ్సిడీతో గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లోని మొత్తం 151 చెరువుల్లో 7,12,000 చేపపిల్లలను విడిచిపెట్టడం జరిగిందని తద్వారా 428 గిరిజన మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం కిరండాల్ చెరువులో 25 వేల చేపపిల్లలు విడిచిపెట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ క్రాంతికుమార్, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు సురేష్, వెంగళరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



కిట్లు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గిరిజన రైతులకు రబీ సీజన్ సాగుకు సంబంధించి పలు పంటల విత్తనాల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట సాగుకు ముందు మట్టి పరీక్షలు చేసుకుని, ఏ నేల ఏ పంట సాగుకు అనువైనదో తెలుసుకుని పండిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న పొలాల్లో నిమ్మగడ్డి సాగు చేయాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో వెదురు సాగుకు రాయితీపై మొక్కలు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

జియ్యమ్మవలస: మండలంలోని గంగమ్మపేట వద్ద ప్రధాన రహదారిలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్‌ఐ అనీష్ ఆధ్వర్యంలో సిబ్బంది అంతా అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లను పరిశీలించారు. అవేమీ లేని వారికి అపరాద రుసుం విధించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారంతా సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు.

సీతంపేట: వాహన తనిఖీల్లో భాగంగా సీతంపేట రోడ్డులో ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తన సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

భామిని: మండలంలోని గురండి కూడలిలో బత్తిలి ఎస్‌ఐ డి.అనిల్‌కుమార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలతో ప్రయాణిస్తున్న వారికి అపరాద రుసుం విధించారు.

ఓటీపీ చెప్పొద్దు..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండలంలోని షేక్‌పాడు, రంగుపురం, దండుసూర, గుమ్మిడిగూడ తదితర గ్రామాల్లో పోలీసులు సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నారాయణరావు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులు, ఫోన్లు, సందేశాలకు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలను తెలియని వారికి చెప్పవద్దన్నారు. లోన్‌యాప్‌లు వినియోగించవద్దన్నారు.



వాహనదారుల లైసెన్స్‌లు పరిశీలిస్తున్న ఎస్‌ఐ అనీష్



సీతంపేట: వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అమ్మన్నరావు



భామిని: గురండి కూడలి వద్ద వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): రంగుపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. 2011–12 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా కలిసి ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని తీర్మానించారు. ఆ తర్వాత అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను వారు సన్మానించారు.

పాలకొండ రూరల్: మండలంలోని చినమంగళాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం జరిగింది. 2016 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా కలుసుకుని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో తమ తీపి స్మృతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని తీర్మానించుకున్నారు.



పాలకొండ రూరల్: చినమంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



జియ్యమ్మవలస: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పారిశుధ్య పనుల పరిశీలన



పాలకొండ పట్టణ వీధుల్లో పర్యటిస్తున్న నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: నగర పంచాయతీలోని పలు వార్డుల్లో కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. వార్డుల వారీగా జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఏ వార్డు చూసినా పరిశుభ్రంగా ఉండాలని, ఆ దిశగా పారిశుధ్య సిబ్బంది పనిచేయాలని తెలిపారు. అలాగే ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అనవసరంగా రోడ్లపై చెత్తాచెదారం పారవేయొద్దన్నారు.

పరామర్శ

పాలకొండ: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు పాలకొండలోని రాజశేఖరం స్వగృహానికి శుక్రవారం వెళ్లి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రాజకీయ గురువును కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు.

పాలకొండ: సీతంపేట ఆదలి వ్యూ పాయింట్ ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురై, పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం కలిసి పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకుడు గర్భాన సత్తిబాబు తదితరులు ఉన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతిలను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కళావతి

దళితులపై దాడి అమానుషం



దళితులపై దాడి, కులదూషణ అమానుషమని ఉత్తరాంధ్ర దళిత బహుజన జేఏసీ నాయకుడు మజ్జి గణపతి ఖండించారు. ఇటీవల వీరఘట్టం మండలం, చిదిమి గ్రామంలో దళితులైన సురేష్, చంటి తదితరులపై అదే గ్రామంలోని కొన్ని అగ్రవర్ణాల వారు, పెత్తందారులు కులం పేరిట దూషించడంతో పాటు వారు ఎదురు తిరుగునందుకు వారిపై భౌతికదాడికి ఎగబడ్డారు. ఇదే ఘటనను నిరసిస్తూ గ్రామంలో బాధితులతో కలిసి శుక్రవారం ఆందోళనకు దిగారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అదుపులోకి తీసుకుని, శిక్షించాలని దళితులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళితుల రక్షణకు చట్టాలను పటిష్టం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులు, దళిత సేన నాయకుడు రామారావు, దళిత సంఘ నాయకులు శ్రీబాబు, పక్కి పుష్పనాథం తదితరులు పాల్గొన్నారు.
–వీరఘట్టం

భారీ వాహనాల రాకపోకలతో అవస్థలు



భామిని మండలం మీదుగా భారీ వాహనాల రాకపోకలతో అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇరుకైన రోడ్లలో భారీ వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, గంటల తరబడి రోడ్డుపైనే ఉండిపోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉన్నందున మండల కేంద్రం మీదుగా భారీ లోడుల వాహనాలకు అనుమతి రద్దు చేయాలని కోరుతున్నారు. ఇదే మండలం మీదుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రోజూ భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అసలే అధ్వానంగా ఉన్న రోడ్లలో ఇలాంటి వాహనాలు వస్తే తాము ఎలా ప్రయాణం చేయాలని ప్రశ్నిస్తున్నారు.
–భామిని

బోధనా సిబ్బందిని నియమించాలి

విజయనగరం జిల్లా, గరివిడిలోని పశువైద్య కళాశాలలో శాశ్వత ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పాలకొండ మండల కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇతర విద్యాసంస్థల నుంచి సిబ్బంది అక్కడికి వెళ్లి, బోధిస్తుండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది లేకపోవడంతో పరీక్షల సమయంలో విద్యార్థుల చదువులు కష్టతరమవుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి, శాశ్వతంగా బోధనా సిబ్బందిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆ సంఘ నాయకులు ఎన్.జనార్దనరావు, కె.చౌదరినాయుడు తదితరులు ఉన్నారు.
–పాలకొండ రూరల్



ప్రమాదం అంచున ప్రయాణం..!





హెల్మెట్ లేని ప్రయాణం నేరం, ప్రమాదకరమని పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా అవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.. కొంతమంది వాహనదారులు. రోడ్లపై విచ్చలవిడిగా పరిమితికి మించి ప్రయాణీకులతో అతివేగంగా హెల్మెట్ ఏమీ ధరించకుండా ఇష్టారాజ్యంగా ప్రయాణాలు చేసేస్తున్నారు. ఎన్నోచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేని కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగినా వాహనదారుల్లో మార్పు మాత్రం రావడం లేదు. వీళ్లు మారరు అంతే అనేలా వీరఘట్టంలో ఇలా ప్రమాదకరంగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తున్న దృశ్యాలు శుక్రవారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.
–వీరఘట్టం



